ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3 నంద్యాల

జిల్లా వార్తలు

బుధవారం 17 ఏప్రిల్ 2024





రోడ్‌షోలో బాలకృష్ణ, తిక్కారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బస్తిపాటి నాగరాజు, జయనాగేశ్వర రెడ్డి





మంత్రాలయం నియోజకవర్గం కోసిగిలో...



బాలయ్య కోసం..





అభిమానుల కోలాహలం.. బాలయ్య అభివాదం



కోసిగిలో..



కోసిగిలో..

జగన్ నయవంచకుడు

- మళ్లీ అధికారంలోకి వస్తే ఊళ్లు, ఆస్తులు వదిలి వెళ్లాల్సిందే
- విజనరీ చంద్రబాబు వల్లే నవ్యాంధ్ర ప్రగతి
- వైసీపీని తరిమేసేందుకు ప్రజలు సిద్ధం కావాలి
- ఎమ్మిగనూరు, కోసిగి రోడ్‌షోల్లో బాలకృష్ణ పిలుపు

కర్నూలు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు/కోసిగి: జాబ్‌క్యాలెండర్ అని, సీపీఎస్ రద్దని, మద్యపాన నిషేధమని ప్రజలను మోసం చేసిన నయ వంచకుడు జగన్ అంటూ ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ధ్వజమెత్తారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా మంగళవారం ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో పర్యటించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం కర్నూలు నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించి అక్కడే బస చేశారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టీడీపీ అభ్యర్థి మాధవరం ఎన్.రాఘవేంద్రరెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. గోనెగండ్ల మండలం వేముగోడు, హెచ్‌కైరవాడి, గోనెగండ్ల మీదుగా ఎమ్మిగనూరుకు చేరుకున్నారు. శివ సర్కిల్‌లో జరిగిన సభలో మాట్లాడారు. అక్కడి నుంచి పట్టణ వీధుల గుండా ముగతి, హాలహర్వి దాటి మంత్రాలయం నియోజకవర్గంలో అడుగుపెట్టారు. కళ్లుదేవకుంట, మంత్రాలయం, మాలపల్లి, మాధవరం మీదుగా కోసిగికి చేరుకున్నారు. రాత్రి కోసిగిలో జరిగిన సభలో బాలకృష్ణ మాట్లాడారు. ఏ పల్లెకు వెళ్లినా తమ అభిమాన నటుడు, తెలుగుదేశం నాయకుడు బాలకృష్ణ రాక కోసం గంటలు తరబడి యువకులు, మహిళలు, రైతులు ఎదురు చూశారు. బాలకృష్ణ రాగానే జై బాలయ్య అంటూ హోరెత్తించారు. జనసేన, బీజేపీ కార్యకర్తలు సైతం బాలకృష్ణ యాత్రలో పాల్గొన్నారు.



యువతలో ఉరకలెత్తిన ఉత్సాహం

జగన్‌కు ఓటు వేస్తే దొంగచేతికి తాళం ఇచ్చినట్లే..

జగన్‌కు ఓటు వేస్తే దొంగ చేతికి తాళం ఇచ్చినట్లేనని బాలకృష్ణ అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని జగన్ అని విమర్శించారు. సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్ దేనికి సిద్ధమో చెప్పాలన్నారు. ఈ రాష్ట్రాన్ని మళ్లీ అప్పుల పాలు చేయడానికి సిద్ధమా..? దళితులు, మైనార్టీలపై దాడులు చేయడానికి సిద్ధమా..? ప్రజల ఆస్తులను అప్పుల కోసం తాకట్టుపెట్టేందుకు సిద్ధమా..? దేనికి సిద్ధం జగన్ అంటూ ప్రశ్నించాడు. ప్రజలు జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని దుయ్యబట్టారు. సంక్షేమానికి పునాది వేసిందే ఎన్టీఆర్ అని అన్నారు. విజనరీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమంతోపాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఐటీ విప్లవం తెచ్చిన గొప్ప వ్యక్తి చంద్రబాబు అంటూ కీర్తించారు.

చేనేతలకు టెక్స్‌టైల్ పార్కు ఇస్తే రియల్ వ్యాపారమా..?

ఎమ్మిగనూరులో అత్యధికంగా ఉన్న చేనేతలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బనవాసి ఫారం వద్ద వంద ఎకరాల్లో గత టీడీపీ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసిందని అన్నారు. వైసీపీ వచ్చాక టెక్స్‌టైల్ పార్కు రద్దు చేసి ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని విమర్శించారు. రూ.1986 కోట్లతో ఆర్డీఎస్ ప్రాజెక్టును తెస్తే వైసీపీ ప్రభుత్వం ఆపేసిందని, ఎమ్మిగనూరుకు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని రూ.145 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ తెస్తే జగన్ ఆపేశారని పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకా సౌమ్యురాలు.. పేదరాలు అంటూ జగన్ చెప్పారని, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.360 కోట్లు అప్పు తీసుకొని ఎగ్గొట్టిన బుట్టా రేణుకా పేదరాలు.. సౌమ్యురాలా అని ప్రశ్నించారు.

జగమంతా రామమయం..!

- నేడు శ్రీరామనవమి
- వైష్ణవ దేవాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు



కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 16: శ్రీరాముని జన్మదిన వేడుక 'శ్రీరామనవమి'ని బుధవారం ఉమ్మడి జిల్లాలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని వైష్ణవ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కల్యాణ వేడుకలకు ఆలయాల కమిటీల నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల కోసం చలువ పందిళ్లు నిర్మించారు. తీర్థ, ప్రసాదాల పంపిణీకి క్యూలైన్లు సిద్ధం చేశారు. వేసవిలో దాహార్తి తీర్చేందుకు మంచినీటి వసతి కల్పించారు. జిల్లాలో ఏటా సీతారాముల కల్యాణ వేడుకలు వైభవోపేతంగా నిర్వహిస్తుండగా, ఈ ఏడాది గ్రీష్మ తాపం ఎక్కువగా ఉన్నా ఉత్సవాలకు ఎలాంటి లోటు లేకుండా ఘనంగా నిర్వహించనున్నారు.

నగరంలోని ఆలయాల్లో కల్యాణ వేడుకలు

నగరంలోని వైష్ణవ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా ఆలయాల్లోని ఉత్సవ మూర్తులను కల్యాణానికి సిద్ధం చేశారు. పెద్ద పెద్ద పందిళ్లు వేసి, వాటి కింద కల్యాణ వేదికలు నిర్మించారు. భక్తులు ఈ వేడుకలు వీక్షించేందుకు జంపకానాలు వేశారు. మంచినీటి సౌకర్యం కల్పించారు. నగరంలో అతి పురాతన దేవాలయం శ్రీరాంబొట్ల దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ నగరూరు దీప్తి ఆధ్వర్యంలో కల్యాణ వేడుకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పాతనగరంలోని శ్రీరామాలయం, కొత్తపేటలోని కోదండ రామస్వామి దేవాలయంలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త ఈ. మల్లికార్జునరెడ్డి తెలిపారు. నగరంలోని బళ్లారి చౌరస్తాలోని హనుమాన్ దేవాలయంలో, వీఆర్ కాలనీలోగల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, బాపూజీనగర్‌లోని కోదండ రామాలయంలో, మాధవీనగర్‌లోని శివరామాలయంలో, అశోకనగర్‌లోని హనుమాన్, సాయిబాబా దేవాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లోగల హనుమాన్ దేవాలయాల్లో కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నారు.



కల్యాణ వేడుకలకు సిద్ధమైన పాతనగరంలోని రాంబొట్ల దేవాలయం

చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా

- మద్యం, నగదు, గంజాయిలను రానీయం
- ఎస్పీ రఘువీర్ రెడ్డి

నందికొట్కూరు రూరల్, నంద్యాల క్రైం, ఏప్రిల్ 16 : అంతర్రాష్ట్ర, జిల్లా చెక్ పోస్టులవద్ద నిఘాను కఠినతరం చేయాలని జిల్లాలోకి అక్రమ మద్యం, నగదు, గంజాయి వంటి వాటిని రానివ్వకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని, చెక్ పోస్టులవద్ద నిఘా పెంచాలని ఎస్పీ రఘువీర్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం నందికొట్కూరు సర్కిల్ పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం కోళ్ళబావాపురం వద్ద గల అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి అక్రమ నగదు, మద్యం, గంజాయి, బంగారం వంటి విలువైన వాటిని జిల్లాలోకి రానివ్వకుండా అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, నందికొట్కూరు సీఐ విజయభాస్కర్, ప్రకాష్‌కుమార్, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున సిబ్బంది పాల్గొన్నారు.



కోళ్ళబావాపురం వద్ద అంతర్ జిల్లా చెకపోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

శిక్షణా శిబిరాలను సందర్శించిన కలెక్టర్



ఆత్మకూరులో పోలింగ్ సిబ్బంది శిక్షణా శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఆత్మకూరు, నందికొట్కూరు, ఏప్రిల్ 16: ఆత్మకూరు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది ఇస్తున్న శిక్షణ గురించి శ్రీశైలం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ఐదు మండలాల నుంచి మొత్తం 555 మంది పీవోలు, ఏపీవోలు హాజరు కావాల్సి ఉండగా 15 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఉద్యోగులకు కేటాయించి విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే మార్చేందుకు అదనంగా ఈవీఎంలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

నందికొట్కూరులో...

నందికొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీవోలు, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, రిటర్నింగ్ అధికారి ఎం. దాసు పరిశీలించారు. డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో పీవోలు, ఏపీవోలదే కీలకపాత్ర కాబట్టి వారికి ఎన్నికల ప్రక్రియపై సమగ్ర అవగాహన ఉండాలని అన్నారు.

టీడీపీలో చేరిన ఎమ్మెల్యే ఎర్రకోట కుటుంబ సభ్యులు





బాలయ్య సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఎమ్మెల్యే బంధువులు

ఎమ్మిగనూరు: ఏప్రిల్ 17: ఎమ్మిగనూరు వైసీపీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కుటుంబ సభ్యులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎర్రకోట స్వయాన సోదరుల కుమారులు, వైసీపీ నాయకులు కె.విరుపాక్షిరెడ్డి, కె.బాలకృష్ణారెడ్డి, కె. చెన్నారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాళ్లదొడ్డి కె.చెన్నారెడ్డిలు స్వర్ణాంధ్ర సాకార యాత్ర సభకు చేరుకున్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వారికి పసుపుకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్లిం మైనార్టీ నాయకులు కలీముల్లా, తురేగల్ నజీర్‌లు బాలకృష్ణను సన్మానించారు. ఓ రైతు తన పొలంలో ఎండిన పంటను బాలకృష్ణకు చూపిస్తే ఆ పంటను భుజాన పెట్టుకొని ఇది జగన్ ప్రభుత్వ తీరు అని ఎద్దేవా చేశారు. అనంతరం పలువురు నాయ కులు బాలకృష్ణకు మెమొంటోలు ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు, మంత్రాలయం టీడీపీ అభ్యర్థులు బీవీ జయనాగేశ్వరరెడ్డి, మాధవరం ఎన్. రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కడప జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

● లోకాయుక్త ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 16: కడప జిల్లాలోని రెండు మండలాల్లో ఒక రాజకీయ నాయకుడు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నాడంటూ వచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర లోకాయుక్త స్పందించింది. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం దిగి వచ్చి సదరు ఆక్రమణలను అరికట్టింది. కడప జిల్లాలోని పోరుమామిళ్ల మండలంలోని అవధూత కాశిరెడ్డినాయన మండలాల్లో పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అనే రాజకీయ నాయకుడు, అతడి కుటుంబీకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వాటిని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడని దళిత్ కమిటీ పీపుల్ అనే సంస్థ రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త కడప జిల్లా కలెక్టర్‌కు గతంలో ఆదేశించింది. ఈ మేరకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం సదురు అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ఆక్రమణలను అరికట్టినట్లు రాష్ట్ర లోకాయుక్తకు తమ నివేదికలో తెలియజేశారు. దీంతో సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

22 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16: టైలరింగ్, (హైయర్, లోయర్) డ్రాయింగ్ (హైయ్యర్, లోయర్), హ్యాండ్‌లూమ్ (హైయర్, లోయర్) టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ మంగళవారం తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో పొందాలన్నారు. పరీక్షల కోసం అభ్యర్థులు తప్పనిసరిగా పాస్‌ఫొటో, పాన్‌కార్డు తదితర ప్రభుత్వం జారీ చేసిన ఒక ఒరిజినల్ చెల్లుబాటయ్యేలా ఏదో ఒక ఫొటో గుర్తింపు కార్డుతో పాటు వారి హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు.

పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16: ఎన్నికల ప్రవర్తన నియమావళిపై మంగళవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాణ్యం నియోకవర్గం ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024 పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను కర్నూలు జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో స్వీకరిస్తారని తెలిపారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభవుతుందన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ వాహనాలకు 100 మీటర్ల దూరంలో ఉంచుకోవాలన్నారు. నామినేషన్ వేయడానికి ర్యాలీగా వచ్చే అభ్యర్థులు మూడు వాహనాలను మాత్రమే వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ ప్రతినిధి సురేష్, టీడీపీ ప్రతినిధి ఛత్రపతి రెడ్డి, బీఎస్పీ పార్టీ ప్రతినిధి, పాణ్యం నియోజకవర్గ ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు

సానుభూతి కోసమే గులకరాయి డ్రామా : టీడీపీ



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 16: ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు చెప్పుకోడానికి చేసింది ఏమీ లేక సానుభూతి కోసమే గులకరాయి డ్రామా సీఎం జగన్ రెడ్డి ఆడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనతో దివాళా తీస్తుందని అన్నారు. ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కడతారని వారు ధీమా వ్యక్తం చేశారు.

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక



పసుపు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 16: పాణ్యం నియోజకవర్గంలో టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు పాండు, సుధాకర్, సోమశేఖర్, కృష్ణ, వెంకటేశ్వర్లు, దివాకర్, అశోక్‌తోపాటు అతని అనుచరులు టీడీపీలో చేరారు. మంగళవారం ఓర్వకల్లుకు చెందిన 40 కుటుంబాలతో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి గౌరు వెంకటరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఏసేబు, మండల అధ్యక్షుడు గోవిందరెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నన్నూరు విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అయ్యస్వామి పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలు పట్టవా?

● పూర్తి చేయకుండానే జంబో ప్లాట్‌ఫారం ప్రారంభం

● రూ.కోటి బిల్లు చెల్లిస్తేనే పనులు చేస్తానంటున్న కాంట్రాక్టర్



కర్నూలు మార్కెట్ యార్డులో పనులు పూర్తి కాకుండానే ప్రారంభించిన జంబో ప్లాట్‌ఫారం

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 16: వైసీపీ ప్రభుత్వంలో రైతుల ప్రయోజనాల కంటే తమ ప్రయోజనాలే ముఖ్యమనే తీరులో ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల పంట ఉత్పత్తులను నిల్వ చేసేందు కోసం రూ.6 కోట్లు ఖర్చు పెట్టి జంబో ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే.. ఈ విషయాన్ని ముందుగానే అంచనా వేసిన అధికార పార్టీకి చెందిన నాయకులు షెడ్యూలుకు ముందే ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని పూర్తి చేయకుండానే అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ప్రారంభించేశారు. వాస్తవంగా జంబో ప్లాట్‌ఫారానికి సంబంధించి ప్లాస్టింగ్, కాల్వల నిర్మాణం, కల్వర్టులు, పెయింటింగ్ తదితర పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే గానీ.. రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనాన్ని అందించే అవకాశాలు ఉండవు.

రూ.కోటి బిల్లులు రావాలి:

కర్నూలు మార్కెట్ యార్డులో జంబో ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టరుకు ఇంకా రూ.కోటి దాకా బిల్లు చెల్లించాల్సి ఉంది. గత నవంబరులో రూ.70 లక్షలు, డిసెంబరులో రూ.30లక్షల బిల్లులు చెల్లించేందుకు మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు నివేదికలు అందించారు. అదిగో.. ఇదిగో అంటూనే దాదాపు 5 నెలలు గడిచిపోయాయి. బయట అప్పులు తెచ్చి ఇప్పటి దాకా పనులు పూర్తి చేసిన కాంట్రాక్టరు ఇక తమకు బిల్లులు వస్తాయో రావోనని తలపట్టుక్కూర్చున్నారు. బిల్లులు వస్తేనే పనులు చేయగలుగుతామని, ప్రస్తుతం బయటి వ్యక్తుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల నిర్మాణం పూర్తి చేయకుంటే వర్షం నీరు ప్లాట్‌ఫారాల్లోకి వచ్చి తమ పంట ఉత్పత్తులన్నీ తడిసిముద్దవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> ● **తొందరలోనే పనులు మొదలు పెడుతాం**
>
> కర్నూలు మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న జంబో ప్లాట్‌ఫారంను తొందరలోనే పూర్తి చేస్తాం. వచ్చే ఖరీఫ్‌కు రైతులు ఈ ప్లాట్‌ఫారం నుంచి పూర్తి ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు అందినా, అందకపోయినా త్వరలోనే పనులు మొదలు పెట్టి కాల్వల నిర్మాణంతో పాటు కల్వర్టులు, పెయింటింగ్, ప్లాస్టింగ్ తదితర పనులన్నీ పూర్తి చేయిస్తాం. - సుబ్బారెడ్డి, డీఈఈ

ఓటు అడిగే హక్కు ఉందా?

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిపై బీసీ ఫైర్



ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ

అవుకు, ఏప్రిల్ 16: బనగానపల్లె నియోజకవర్గంలో ప్రజలకు ఓటు అడిగే హక్కు కాటసాని రామిరెడ్డికి ఏమాత్రం లేదని మాజీ ఎమ్మెల్యే, బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుంకేసుల గ్రామానికి చేరుకున్న బీసీ సోదరులు బీసీ జనార్దన్‌రెడ్డికి, బీసీ రాజారెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. జగన్ వచ్చీ రాగానే వ్యవస్థలను నాశనంచేశాడని మండిపడ్డాడు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మద్యపాన నిషేధం హామీ ఏమైందని ప్రశ్నించారు. అమ్మఒడి పథకంలో రూ.2వేలు కమిషన్ తీసుకుని దోచుకున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక ఇన్‌పుట్ సబ్సిడీ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పల్లె ప్రగతి కోసం వినియోగించాల్సిన సర్పంచుల నిధులనూ జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సుంకేసుల గ్రామంలో సొంతనిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమలు టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఏడాదికి ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని బీసీ సోదరులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీ.పక్కీరారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మొట్ల రామిరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, కైప చంద్రశేఖర్‌రెడ్డి, కైప శేఖర్‌రెడ్డి, మంచాల ప్రతాప్‌రెడ్డి, చౌడయ్య, వల్లపురెడ్డి మోహన్‌రెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, నారపురెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు 'కందుకూరి' స్ఫూర్తి

విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 16: సంఘ సంస్కర్త, తెలుగు భాషా వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు రంగస్థల కళాకారులకు చెదరని స్ఫూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. 'కందుకూరి' పురస్కారాలను సీనియర్ రంగస్థల కళాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తొలుత కందుకూరి చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బలరామయ్య మాట్లాడుతూ తెలుగు నాటక రంగ దినోత్సవం అంటే రంగస్థల కళాకారులందరికీ ఒక పండుగ వంటిదని చెప్పారు. ఆహ్వాన అతిథులుగా విచ్చేసిన విద్యాసంస్థల అధినేతలు జి.పుల్లయ్య, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కందుకూరి జయంతిని కళాకారులంతా సమష్టిగా కలిసి జరుపుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సందర్భంగా 'కందుకూరి' రంగస్థల పురస్కారాలు సీనియర్ నాటక కళాకారులు శారదాబాయి, ఎస్ అబ్దుల్లా, గాండ్ల లక్ష్మన్న, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్, సుబ్బారావు, తిరుపాలు, టి. రాజశేఖర్‌రావు, పి. భాస్కర్, గుర్రపుశాల అంకయ్య, బీసన్న, కె. అరుణ, మధు, కృష్ణలకు అందజేసి జ్ఞాపిక, శాలువలతో అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, కళాకారులు వి. హనుమంతరావు చౌదరి, మనోహర్‌బాబు, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రదర్శించిన 'శ్రీకృష్ణ రాయబారం' నాటకంలోని పడకసీనును ప్రేక్షకులను అలరింపజేసింది.

సమన్వయంతో పని చేయండి

వాణిజ్య పన్నుల శాఖ జేసీ సుధాకర్



మాట్లాడుతున్న వాణిజ్య పన్నుల శాఖ జేసీ సుధాకర్

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 16: జిల్లాలోని స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు (ఎస్ఎస్‌టీ) సమన్వయంతో పని చేయాలని, తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన తర్వాతే శిబిరాలను ఏర్పాటు చేసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని ఎస్ఎస్‌టీ బృందాలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఒక కారులో రూ.50వేలకు మించి ఆధారాలు లేని నగదు లభ్యమైతే సీజ్ చేయాలన్నారు. అదేవిధంగా పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రి విలువ రూ.10వేలు మించితే ఆ వివరాలు ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ లాగిన్‌లో నమోదు చేయాలని సూచించారు. సదరు వివరాలు నమోదు కాగానే ఎన్నికల నిబంధనల అమలు చేస్తున్న సుమారు 13 ఏజెన్సీలకు సమాచారం వెళ్తుందన్నారు. సంబంధిత శాఖలతో ఎస్ఎస్‌టీ బృందాలు సమన్వయం చేసుకోవాలన్నారు. సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువులను సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి, జడ్పీ సీఈఓ జి.నాసర రెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా పోలీసులు, ఎఫ్ఎస్‌టీ టీమ్, ఎస్ఎస్‌టీ టీమ్ ద్వారా 13 రకాలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఏదైనా పరిమితికి మించిన నగదు, ఇతరత్రా వస్తువుల సరఫరాను నియంత్రించినట్లయితే ఆ విషయాన్ని సంబంధిత ఆర్ఓ ద్వారా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్/సీజర్ కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి మాట్లాడుతూ ఎస్ఎస్‌టీ బృందాలు తనిఖీ చేసే ప్రక్రియ మొత్తం వీడియో తీయించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిబంధనలను తప్పక పాటించండి

● కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు

● రేపటి నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ



నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 16: నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల సంసిద్ధతలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 18 వతేదీన ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ అఫిడవిట్ 26ఏ లోని వర్తించే, వర్తించని కాలమ్స్‌లలో వివరాలన్నింటిని తప్పక పూరించాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లును తీసుకురావాలని, అన్ని రకాల డ్యాక్యుమెంట్లు సక్ర మంగా ఉంటే నామినేషన్లను స్వీకరిస్తామని అన్నారు. ఈనెల 18వ తేదీ నుండి 25వరకు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. ప్రభుత్వ సెలవుదినాలలో నామినేషన్ల స్వీకరణ ఉండదని అన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులకు గరిష్టంగా 3 వాహనాల అనుమతి ఉంటుందని అన్నారు. అభ్యర్థితో సహా ఐదుగురిని ఆర్ఓ ఆఫీస్‌లోకి అనుమతి ఇస్తామన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం-2ఏ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం-2బి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నవీన్ కుమార్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 16: తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీఎస్ నవీన్‌కుమార్‌ను పార్టీ అధ్యక్షులు తిక్కారెడ్డి ప్రకటించారు. మంగళవారం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నందమూరి బాలకృష్ణ సమక్షంలో ప్రకటించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పని చేసిన ఆయనకు అవకాశం కల్పించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకార సామాజిక వర్గంపై ప్రత్యేక దృష్టి సారించి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని తిక్కారెడ్డి కోరారు. మత్స్యకార కోటాలో కర్నూలు జిల్లా మంత్రాలయం సీటు ఆశించిన ఆయనకు ప్రభుత్వం అధికారం లోకి వస్తే తగిన న్యాయం చేస్తామని తెలిపారు.

సెలవు దినాల్లో కౌంటర్లు ఏర్పాటు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 16: కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయంలోని పన్ను వసూలు కౌంటర్లు సెలవు దినాల్లో కూడా పని చేస్తాయని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు మంగళవారం తెలిపారు. బుధవారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సెలవు రోజు అయినా కూడా స్థానిక మున్సిపల్ కార్యాల యంలో కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించిన ఆస్తి పన్ను ఏక మొత్తంగా నెలాఖరులోపు చెల్లించిన పన్నుదారులుకు 5 శాతం రాయితీ పొందవచ్చునని ఆయన తెలిపారు.

కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న వెంగల్ రెడ్డి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16: కర్నూలు నగర ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నగర కార్యదర్శిగా రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా రాజశేఖర్, నాగకిషోర్ ఎన్నికయ్యారు. మంగళవారం నగరంలోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యాలయంలో నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా జిల్లా సంయుక్త కార్యదర్శి చిరంజీవి, ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా అధ్యక్షులు వెంగల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని ఏపీ ఎన్జీవోల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయిరాం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి చర్యలు: డీఎల్‌పీవో



పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న డీఎల్‌పీవో

పగిడ్యాల, ఏప్రిల్ 16: గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాసనాయుడు సిబ్బందికి సూచించారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీ నాగేంద్రమయ్య ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ 2024-25కు సంబంధించి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధుల కేటాయింపు, ఖర్చు చేయడానికి అవసరమైన విధివిధానాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జల్‌జీవన్, స్వచ్ఛ భారత్ మిషన్, జాతీయ గ్రామీణ ఆరోగ్య శాఖకు సంబంధించిన నిధులను గ్రామ పంచాయతీలకు కేటాయించనున్నట్లు తెలిపారు.

'ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'

పాములపాడు, ఏప్రిల్ 16: సచివాలయ సిబ్బంది ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో సరస్వతి హెచ్చరించారు. ఎంసీసీలో భాగంగా మంగళవారం మండలంలోని మిట్టకందాల గ్రామంలోని వీధులను ఎంపీడీవో సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ రామేశ్వర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీరంగనాథ స్వామికి పట్టు వస్త్రాలు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న తహసీల్దార్

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 16 : మండలంలోని తర్తూరు గ్రామంలో వెలసిన లక్ష్మీరంగనాథ స్వామి మంగళవారం పెళ్లి కుమారుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. జూపాడుబంగ్లా తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ దంపతులు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా వచ్చి స్వామి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ పూజారులు రంగనాథ స్వామిని పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ వెంక రమణ, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, నాగన్న, ఆర్ఐ రంగా రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

27 మందిపై బైండోవర్ కేసులు

కొత్తపల్లి, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కొత్తపల్లి మండలంలోని 27 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని శివపురంలో 14 మందిపై, ఎదురుపాడులో 13 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. అలాగే పాలెంచెరువు, గువ్వలకుంట్ల గ్రామాల్లో మరో ముగ్గురిపై సారా కేసులు నమోదు చేశామని తెలిపారు.

అమ్మవారికి వెండి హారం

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 16: నంద్యాలలో వెలసిన జంబులాపరమేశ్వరీదేవి భక్తులు రూ.75వేల విలువ చేసే వెండి హారాన్ని విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. తాలికోట సుశీలమ్మ కుమారుడు జంబులయ్య వెండి హారాన్ని ఆలయ కమిటీ అధ్యక్షురాలు గాండ్ల రాజేశ్వరి, సభ్యుడు జగన్‌కు అందజేశారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులను సన్మానించారు.

'ముందస్తు సమాచారం ఇవ్వాలి'

ఆత్మకూరు, ఏప్రిల్ 16: వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎన్నికల టర్నింగ్ ఆఫీసర్ సుధారాణి, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం నందు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 18వ తేది నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి నామినేషన్లు వేయబోయే అభ్యర్థులు ఏవైనా ర్యాలీలు, సభలు ఉన్నట్లయితే ముందస్తు సమాచారం అందించాలని సూచించారు.

నీటి కోసం వెళ్లి నదిలో ఆవు మృతి

కొత్తపల్లి, ఏప్రిల్ 16: చెంతనే కృష్ణమ్మ ఉన్నా.. నదీతీర గ్రామాల్లో తాగునీరు లేక గ్రామస్థులతో పాటు మూగజీవాలకు సైతం నీరు దొరకని పరిస్థితి నెలకొంది. మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప గ్రామాల్లో చేతిపంపులు మొరాయిస్తుండటంతో గ్రామస్థులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామాల్లో తాగునీరు లేకపోవడం వల్ల బలపాలతిప్పలోని గంగమ్మ అనే మహిళకు చెందిన పాడి ఆవు మంగళవారం సమీపంలోని ఉన్న కృష్ణానదిలోకి నీరు తాగేందుకు వెళ్లింది. నదిలో బురదమయం అధికంగా ఉండటంతో ఇరుక్కుని పైకి రాలేక, ఊపిరాడక మృతి చెందింది. ఈ రెండు గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సోలార్ మోటార్ల ద్వారానే తాగునీరు సరఫరా అయ్యేది. అవి కూడా మరమ్మతులకు గురి అయ్యాయి. ఉన్న చేతి పంపులు సైతం చెడిపోవడంతో గ్రామస్థులు తాగునీటి కోసం సమీపంలోని కృష్ణానది నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డిని వివరణ కోరగా సిబ్బందితో కలిసి వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు.

ఎమ్మెల్యే శిల్పా అసమర్థతతోనే నీటి కష్టాలు

● శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు: పదో వార్డులో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



ఎర్రగుంట్లలో మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖరరెడ్డి



వెలుగోడు: టీడీపీలో చేరిన వారితో బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 16: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అసమర్థత వల్లే ఆత్మకూరు ప్రాంతంలో తాగు, సాగునీటి కష్టాలు తలెత్తాయని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆత్మకూరు మండలంలో సిద్దేపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, సుంకన్న ఆధ్వర్యంలో సుమారు 70కుటుంబాలు బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరాయి. బుడ్డా మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎంతో కష్టపడి సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తే.. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం పంట కాలువలను కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా సిద్ధాపురం చెరువుకు సకాలంలో నీరు నింపింటే నేడు మండలంలో సాగు, తాగునీటి కష్టాలు వచ్చేవి కావని అన్నారు. ఎమ్మెల్యే శిల్పాకు ఈ ప్రాంత సమస్యలపై అవగాహనే లేదని అన్నారు. తాను స్థానికుడినని, ఇక్కడి ప్రజల కష్టాలేంటో తనకు తెలుసని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే సిద్దేపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీలోకి చేరికలతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, మాజీ వైస్ ఎంపీపీ పుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసులు, శివశంకరశర్మ, మాజీ సర్పంచ్ గంగాధరరెడ్డి, నాయకులు రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, రమణ, రామనర్సయ్య తదితరులు ఉన్నారు.

● ఆత్మకూరు పట్టణానికి చెందిన వైసీపీ మైనార్టీ నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ రషీద్ మంగళవారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో తన అనుచరగణంతో టీడీపీలోకి చేరారు. అదే విధంగా పట్టణంలోని 10వ వార్డుకు చెందిన రాముడు, తిరుమలేష్ ఆధ్వర్యంలో సుమారు 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు.

బండిఆత్మకూరు: వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పాకు డిపాజిట్లు కూడా దక్కవని టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం రాత్రి మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో నరసింహారెడ్డి, సిద్దయ్య సమక్షంలో జగన్మోహన్‌రెడ్డి, రంగస్వామి రెడ్డితో పాటు వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. లింగాపురం గ్రామంలో బాబు, హేమసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, సోమయాజులపల్లెలో చెన్నారెడ్డి ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, కడమలకాల్వ గ్రామంలో మధుభూపాల్, బలరాముడు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. న్యాయవాది తులసిరెడ్డి, రామలింగారెడ్డి, సురేష్‌రెడ్డి, మనోహర్‌చౌదరి, డాక్టర్ భరద్వాజశర్మ, బుగ్గరాముడు, శంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సాయిబాబారెడ్డి, వీపేట శీను, జనసేన సురేష్, ఆచారి పాల్గొన్నారు.

వెలుగోడు: రాష్ట్రంలో టిడిపితోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. రేగడ గూడూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వంగాల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ అంబాల రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో హఫీస్‌మియ్యా, 20 కుటంబాలు టీడీపీలో చేరాయి. వెలుగోడు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు చంద్ర వీరాంజనేయులు, సుందరరావు ఆధ్వర్యంలో 20 కుటంబాలు టీడీపీలో చేరాయి.

రేపు బుడ్డా రాజశేఖరరెడ్డి నామినేషన్ దాఖలు

ఆత్మకూరు: శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుడ్డా రాజశేఖరరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మధ్యాహ్నం 12.30గంటల తర్వాత స్థానిక రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం గౌడ్‌సెంటర్‌లో భారీ సభను నిర్వహించనున్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా నామినేషన్ ప్రక్రియకు ఆ పార్టీ శ్రేణులు భారీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వేలాది సంఖ్యలో టీడీపీ శ్రేణులు నామినేషన్‌కు తరలిరానున్నట్లు తెలిసింది. ఇందుకు తగ్గట్లుగా ఆ పార్టీ నాయకులు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.

ఇదిలావుంటే అదేరోజు శ్రీశైల నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేయనున్నారు. అయితే ఈయన మధ్యాహ్నం 12.30గంటల్లోగా తమ నామినేషన్ పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే ఈయన నిరాడంబరంగా నామినేషన్ వేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇదిలావుంటే రెండు ప్రధాన పార్టీల నాయకులు ఒకే రోజు నామినేషన్ దాఖలు చేస్తుండటంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం

● టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి,
పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత



మాట్లాడుతున్న టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి

గడివేముల, ఏప్రిల్ 16: ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన వైసీపీని ఇంటికి సాగనంపుదామని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరిత అన్నారు. మండలంలోని కొర్రపోలూరు, కె.బొల్లవరం, బిలకలగూడురు గ్రామాల్లో మంగళవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రైతులకు సాగునీరు ఇవ్వలేదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కూడా గిట్టుబాటు ధర కల్పించలేదని అన్నారు. జొన్న కొనుగోలులో కూడా వివక్ష చూపారని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మండలంలో జిందాల్ పరిశ్రమ ఉన్నా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వలేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సూపర్-6 పథకాలు అమలు చేసి బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్‌ఏ రఫిక్, సుదర్శన్‌రెడ్డి, జయంత్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత'

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 16: వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి. తాతిరెడ్డి తులసిరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. మంగళవారం నంద్యాలలోని 12 వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో టీటీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'తిరుణాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

పగిడ్యాల, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా పగిడ్యాలలో నిర్వహిస్తున్న చెన్నకేశవ స్వామి తిరుణాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల గ్రామంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని, ఎలాంటి ప్రచారాలు చేయరాదని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు.

ముగిసిన సదస్సు

పాణ్యం, ఏప్రిల్ 16: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న అభినవ సిగ్మా2కె24 జాతీయ సాంకేతిక సదస్సు మంగళవారం ముగిసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతిభ, నైపుణ్యాలను కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతి అందజేశారు. హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో గౌరు చరిత

గడివేముల, ఏప్రిల్ 16: మండలంలోని కె.బొల్లవరం గ్రామంలో వైసీపీ నాయకుడు నాగరాజు, ఆయన అనుచరులు మంగళవారం పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరిత సమక్షంలో టీడీపీలో చేరారు. గౌరుచరిత వైసీపీ నాయకులు నాగరాజు, వెంకటేశ్వర్లు, సుంకన్న, కొండరాజు, కృష్ణ, నాగేంద్రలకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పుట్టుపల్లిలో 70 కుటుంబాలు..

మహానంది, ఏప్రిల్ 16: మండలంలోని పుట్టుపల్లిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీ అరాచకపాలనకు అంతం మొందించాలనే ఉద్దేశంలో భాగంగానే తాము టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు.

'రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్'

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 16: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు అన్నారు. మంగళవారం నంద్యాలలోని స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక్క అవకాశమని అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. దళితులకు చెందాల్సిన రూ.72వేల కోట్ల నిధులను పక్కదారి పట్టించి సంక్షేమ పథకాల పేరిట వాడుకోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులు లింగంగుంట రామలింగం, చీఫ్ అడ్వైజర్ పగిడిపల్లె రాజారావు, రాష్ట్ర నాయకులు పల్లి నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి దస్తగిరి స్వామి ఉరుసు

పాణ్యం, ఏప్రిల్ 16: మండలంలోని సాబ్జహాన్ కొట్టాలలో బుధవారం నుంచి 20వ తేదీ వరకు హజరత్ దస్తగిరిస్వామి ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. బుధవారం గంధం, 18న ఉరుసు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉరుసు సందర్భంగా గుండు పందెం, సందా పందెం, మోకు పందెం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు, 20న రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగు పోటీలు జరుగుతాయన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి'

ఆత్మకూరు, ఏప్రిల్ 16: అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఫైర్ ఆఫీసర్ భీముడునాయక్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కరివేన గ్రామ సమీపంలో గల డీపాల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు

శ్రీశైలం, ఏప్రిల్ 16: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబకు అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. మంగళవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిన మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలి: కలెక్టర్

నందికొట్కూరు ఏప్రిల్ 16: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నందికొట్కూరు నియోజకవర్గంలో కేంద్ర సాయుధ బలగాలతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ కవాత్తు నందికొట్కూరు పోలీస్‌స్టేషన్ నుంచి పాతబస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, కేజీ రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ వరకు కవాతు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు ఇవ్వకుండా ప్రశాతంగా తమ ఓటు హక్కును ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు ప్రకాష్‌కుమార్, విజయభాస్కర్, ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'నిర్భయంగా వినియోగించుకోవాలి'

నంద్యాల క్రైం/పగిడ్యాల: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి కోరారు. మంగళవారం ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని నందికొట్కూరు, ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పోలీస్ కవాతు నిర్వహించారు. ఆత్మకూరు డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, సీఐలు విజయభాస్కర్, జి.ప్రకాష్‌కుమార్, సబ్ డివిజన్ ఎస్సైలు, కేంద్ర సాయుధ బలగాల అధికారులు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● జిల్లాలోని ఆత్మకూరు సబ్ డివిజన్ నందికొట్కూరు రూరల్ సర్కిల్ పరిధిలోని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, పలు క్రైం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్టేషన్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. ఆత్మకూరు డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టరు రవీంద్ర, నందికొట్కూరు ఇన్‌స్పెక్టర్ విజయ్‌భాస్కర్, జి.ప్రకాష్‌కుమార్, ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ నాగార్జున పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధం

● నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య



ప్రజలతో మాట్లాడుతున్న గిత్తా జయసూర్య

నందికొట్కూరు ఏప్రిల్ 16: వైసీపీ అరాచకపాలన నుంచి విముక్తి పొందేందుకు జగన్మోహన్‌రెడ్డిని ఇంటింకి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని బాబు సూపర్ 6 ఎన్నికల శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. నందికొట్కూరు పట్టణంలోని 19వ వార్డులో వార్డు ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య శంఖారావంలో బాబు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఎల్లీశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జయన్న, అచ్చెన్న, శివప్రసాద్, వార్డు ఇన్‌చారిలు ముర్తుజావళి, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

● దళితులకు శిరోముండనం చేసిన కేసులో వైసీపీ నాయకులు తోట త్రిమూర్తులుకు శిక్షపడడంతో న్యాయం గెలిచిందని నందికొట్కూరు టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం దళితులకు శిరోముండన చేసిన కేసులో వైసీపీ నాయకుడు తోట త్రిమూర్తులకు శిక్షపడడంతో టీడీపీ నాయకులు నందికొట్కూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జమీల్, కళాకార్, మోహన్, అయ్యన్న, ఏసేపు, కుమార్, జయన్న, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

మిడుతూరు: మండలలోని దేవనూరులో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య మాట్లాడుతూ టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. దేవనూరు, చిన్నంపల్లి మధ్య కుందూ నదిపై బ్రిడ్జి నిర్మించారని, అయితే వైసీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర లింగారెడ్డి, మండల కన్వీనర్ రమేష్‌రెడ్డి, నాగేంద్ర, రవీంద్రుడు, ఇద్రోష్, కృష్ణారెడ్డి, జనసేన నాయకులు రవికుమార్, సంపత్ పాల్గొన్నారు.

వలంటీర్ల బలవంతపు రాజీనామాలు?

ఆత్మకూరు, ఏప్రిల్ 16: వలంటీర్లపై అధికార వైసీసీ జులుం కొనసాగుతూనే ఉంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వలంటీర్ల ద్వారా లబ్ధి పొందాలన్న కుట్రతో ఏకంగా వారిచే స్వచ్ఛందంగా రాజీనామాలకు ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే మంగళవారం ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామానికి చెందిన 20 మంది వలంటీర్లు గ్రామంలో వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. వీరు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయడంతో అధికారులు వారి రాజీనామాలను ఆమోదించారు. అనంతరం వారు అక్కడి నుంచి నేరుగా వైసీపీ కార్యాలయానికి వెళ్లగా అక్కడ వారిని ఆ పార్టీ నాయకులు అభినందించినట్లు తెలిసింది. తాము అధికారంలోకి వస్తే రాజీనామాలు చేసిన వలంటీర్లను మళ్లీ నియమిస్తామని చెప్పినట్లు సమాచారం. అంతేకాదు ఒక్కొక్కరికి రూ.10వేల నగదు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలావుంటే రాజీనామాలు చేసేందుకు కొంతమంది వలంటీర్లు నిరాసక్తి చూపారు. అయినప్పటికీ వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో రాజీనామా చేశామని కొందరు చెబుతుండటం గమనార్హం.

మహానంది: మహానంది మండలంలో మంగళవారం ఒకే రోజు 63 మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సమర్పించినట్లు చెప్పారు. వ్యక్తి గతంగానే తాము రాజీనామా చేసినట్లు తెలిపారు. కాగా మండలంలో ఇది వరకే 12 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ నేత ఒత్తిడి మేరకు మండలంలోని వలంటీర్లు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. మండలంలో మొత్తం 181 మంది వాలంటీర్లు ఆయా గ్రామాల్లోని సచివాలయంలో విధులు నిర్వహిస్తుండగా మిగిలిన వారిని కూడ రాజీనామా చేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బహిరంగంగా పాల్గొని వైసీపీ గెలుపునకు కృషి చెయ్యాలని ఆ నేత వలంటీర్లను ఆదేశించినట్లు సమాచారం.

నేడు శ్రీరామనవమి వేడుకలు

మహానంది, ఏప్రిల్ 16: మహానంది క్షేత్రంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆలయం ప్రాంగణంలోని అభిషేక మంటపంలో మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు తగ్గ ఏర్పాట్లల్లో భాగంగా తమిళనాడు రాష్ట్రం అంబూరుకు చెందిన జగన్ నేతృత్వంలో అభిషేక మంటపాలన్ని కల్యాణ వేదికగా పూలతో అలంకరించి తీర్చిదిద్దుతున్నట్లు ఈవో తెలిపారు.

పాణ్యం: మండలంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నారు. పాణ్యంలోని రామస్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సువర్ణ మంగళవారం తెలిపారు. బస్టాండు సమీపంలోన వాల్మీకి రామాలయం వద్ద వాల్మీకుల ఆధ్వర్యంలో శ్రీరామ కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. నెరవాడలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో రైతులు, గ్రామ పెద్దలు స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహంచనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలోని రామాలయం రాములోరి కలఠ్యాణ మహోత్సవానికి ముస్తాబైంది. శ్రీరామనవమి పురస్కరించుకుని బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ రెడ్డి, పురోహితులు హరికృష్ణ, గ్రామ పెద్దల సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ధర్మకర్త చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాములవారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు .అలాగే ఉదయం 11 గంటలకు సాయిబాబ విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుందని తెలిపారు.

ఆత్మకూరురూరల్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సీతారాముల పల్లకీ సేవను నిర్వహించనున్నట్లు ఆత్మకూరు శ్రీరామ భక్త బృందం సభ్యులుతెలిపారు. గురువారం పట్టణంలోని ఏకలవ్యనగర్‌లోని రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో హనుమత్ సమేత సీతారాములకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో మంగళవారం భగవత్‌సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో వసంత నవరాత్రులలో భాగంగా సీతరామలక్ష్మణులకు అభిషేకాలు, ప్రత్యే పూజలు చేశారు. అర్చకులు ధనుంజయుడు, భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారధికృష్ణ , భక్తులు పాల్గొన్నారు.

'రామాయణం లేకపోతే మానవాళికి ఆదర్శం లేదు'

నంద్యాల (కల్చరల్): రామాయణం లేకపోతే మానవాళికి ఆదర్శం లేదని ధర్మప్రచారకులు మద్దయ్య స్వామి అన్నారు. టీటీడీ హిందూ ధర్మపచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల లోని ఎస్‌బీఐ కాలనీలోని రామాయలంలో మద్రామాయణ ప్రవచనా సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. ధర్మ ప్రచారకులు మద్దయ్య స్వామి, కమిటీ సభ్యులు, టీటీడీ ప్రచారకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి



శ్రీరామ నవమి వేడుకలకు సిద్ధమైన బేతంచెర్ల గాడుబావి ఆంజనేయస్వామి ఆలయం

బేతంచెర్ల, ఏప్రిల్ 16: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలోని పలక చింతమాను ఆంజనేయస్వామి, గాడుబావి ఆంజనేయస్వామి ఆలయాల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. బుధవారం జరిగే శ్రీరామనవమి పండుగ సందర్భంగా సీతారామ కళ్యాణం నిర్వహణ కోసం వేదికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళ్యాణానికి హాజరయ్యే భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. ఆర్. బుక్కాపురం గ్రామంలో పరుగు పందెం, గుండు ఎత్తడం, జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

చాగలమర్రిలో నవమి ఉత్సవాలు



పారాయణం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఏప్రిల్ 16: చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ ఆలయాల్లో మంగళవారం శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కోదండ రామాలయంలో మహిళలు సామూహికంగా శ్రీరామ పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తుల పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు.

నేడు కల్యాణోత్సవం: చాగలమర్రి గ్రామంలోని భూమా నగర్, పట్టాభిరామ, మల్లెం వీధి, బసవన్న కట్ట, చింతలచెరువు, మూడురాళ్లపల్లె తదితర గ్రామాల్లో శ్రీరామనవమి పండుగ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని భక్తులను కోరారు.

కళ్ల జాగ్రత్తలు తీసుకోండి

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 16: ప్రతి ఒక్కరూ కళ్ల జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ గోపాల్ అన్నారు. కొలిమిగుండ్లలో ఐమిత్ర కంటి ఆసుపత్రిలో బ్రీడ్స్ యూత్ అసోషియేషన్, ఐమిత్ర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కంటి పరీక్షల అనంతరం 30 మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించటానికి కడప పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించినట్లు డాక్టర్ గోపాల్ తెలిపారు. కార్యక్రమంలో బ్రీడ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

డోన్(రూరల్), ఏప్రిల్ 16: మండలంలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వెంకట్రాముడు అనారోగ్యంతో కర్నూలులో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

బనగానపల్లె, ఏప్రిల్ 16: కొలిమిగుండ్ల మండలంలోని కొండమనాయునిపల్లె అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించి, 3000 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి 80లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ జోగేంద్ర మంగళవారం తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్సు సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సెబ్ పోలీసులు దాడి చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో సెబ్ గుత్తి సీఐ శివసాగర్, తాడిపత్రి సెబ్ సీఐ ఫణీంద్ర, ఎస్ఐ పాల్గొన్నారు.

పెద్దబోదనంలో వైద్య పరీక్షలు

చాగలమర్రి, ఏప్రిల్ 16: మండలంలోని పెద్దబోదనం గ్రామంలో 300 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు అంజలి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష నిర్వహించారు. స్త్రీవ్యాధి నిపుణులు కుసుమ, గౌతమిలు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. 18 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి వైద్య నిపుణులు సౌజన్య, సీఎహెచ్‌వో రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రీ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసనాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి మరో షాక్

టీడీపీలో చేరిన ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 16: బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్లలో వైసీపీకి మరోషాక్ తగిలింది. కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లెకు చెందిన ఉమ్మడి కర్నూలు జిల్లాల ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు పులిప్రకాశ్‌రెడ్డి తన అనుచరులతో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. గొర్విమానుపల్లె గ్రామంలో జరిగిన చేరికల కార్యక్రమంలో ప్రస్తుత వైసీపీ ఎంపీటీసీ సీనియర్ వైసీపీ నాయకుడు పులిప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరుడు పులి సుదర్శన్ రెడ్డిల ఆధ్వర్యంలో మరో ముగ్గురు వైసీపీ వార్డు సభ్యులతో కలసి తన అనుచరులతో కలసి బీసీ సమక్షంలో టీడీపీలో చేరారు. గొర్విమానుపల్లె గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పులి ప్రకాశ్‌రెడ్డి, పులిసుదర్శన్‌రెడ్డి ఆయన అనుచరులకు బీసీ జనార్దనరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పులిప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నమ్మకద్రోహానికి మారుపేరన్నారు. గత ఐదేళ్లుగా బనగానపల్లె నియోజవకర్గంలో అభివృద్ధి లేదన్నారు. కాట సాని రామిరెడ్డికి తన కుటుంబంపై ఉన్న ప్రేమ వైసీపీ కార్యకర్తలపై లేదని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరిక

బనగానపల్లె: బనగానపల్లె పట్టణానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలకు చెందిన మహిళలు మంగళవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి బీసీ ఇందిరమ్మ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించింది. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ చంద్రబాబుతోనే మహిళలకు భద్రత ఉంటుందన్నారు. మహిళలకు ఏ కష్టం వచ్చినా టీడీపీ అండగా ఉంటుందన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.



టీడీపీలో చేరిన వారితో బీసీ ఇందిరమ్మ

సూపర్ సిక్స్ పథకాలతోనే అభ్యున్నతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టే సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలతోనే ఏపీలో అభ్యున్నతి సాధ్యమని బనగానపల్లె టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని బీసీ గుర్రెడ్డి కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ జగన్‌ను ఓడించి ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ఏపీని సర్వనాశనం చేసిందని అన్నారు. నిత్యావసర వస్తువులు, డీజల్, పెట్రోల్, ఆర్టీసీ బస్ చార్జీలు పెంచుకుంటూ ప్రజలను వైసీపీ ప్రభుత్వం దోచుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.

బీసీ గెలుపునకు కృషి చేస్తాం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 16: బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన ఇంట్లో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గెలుపు కోసం పని చేసిన తనను రాజకీయంగా అణచివేశారన్నారు. చివరకు పేదలకు ఇళ్లు ఇవ్వడానికి తాను యత్నిస్తే పోలీసులను పంపి ఇళ్లను కూడా ఎమ్మెల్యే కూలగొట్టాడన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని గెలిపిస్తే తమకు కనీస మర్యాద లేకుండా చేశారన్నారు. అందుకే తాను బీసీ జనార్దన్‌రెడ్డి వెంట నడవాలని నిర్ణయించుకున్నానన్నారు. ఈసమావేశంలో టీడీపీ నాయకుడు టంగుటూరు శ్రీనయ్య, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీలు సంగు శ్రీనివాసరెడ్డి, శేషారెడ్డి, లాయర్ నాగేంద్రారెడ్డి, రాయలసీమ సలాం, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల గుర్తింపు

నంద్యాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల పర్వానికి ఎన్నికల అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థుల అనుచరులకు హద్దులను పట్టణ సీఐ రమేష్‌బాబు గుర్తించారు. అభ్యర్థి వెంట మరో నలుగురు రావడానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి ఇచ్చారు. వీరి అనుచరులు నామినేషన్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ఆగిపోవాలని హద్దులు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో టీ అంగళ్లు, పండ్ల వ్యాపారులు, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు.

ముసుగు సంగతేంటి?

శిలాఫలకానికి తొలగిన ముసుగు



నంద్యాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల బ్రిడ్జి వద్ద ఉన్న శిలాఫలకానికి వేసిన ముసుగు తొలగిపోయింది. ఈ శిలాఫలకం ప్రధాన రహదారిలోనే ఉంది. వచ్చి పోయే వారంతా తొలగిపోయిన ముసుగును చూసి ఎన్నికల అధికారులకు ఇది కన్పించడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రుద్రవరం, ఏప్రిల్ 16: రుద్రవరం ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 6వతరగతి ప్రవేశాలకు ఈనెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు తెలిపారు. అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీపీఎఫ్ఎస్ఎస్.జీవోవీ.ఇన్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు తమ ఐడీ, పుట్టిన తేదీ వివరాలు వెరిఫికేషన్ కోడ్ వివరాలు నమోదు చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. షెడ్యూలు ప్రకారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వర ఐదో తరగతి స్థాయి సిలబస్ తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో పరీక్ష ఉంటుందని చెప్పారు. పరీక్ష విధానం మొత్తం వంద మార్కులకు రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష అర్హత మార్కులు ఓబీసీ విద్యార్థులకు 35, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30గా నిర్ణయించినట్లు తెలిపారు.

'పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 16: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్ సూచించారు. మంగళవారం రాత్రి గ్రామ పెద్దలతో సీఐ, ఎస్ఐలు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామం కావడంతో లా అండ్ఆర్డర్ సమస్య వస్తుందని పోలీసు పరిమిషన్ ఇవ్వలేదని అన్నారు. ఈ విషయంపై గ్రామానికి చెందిన నరేంద్రారెడ్డి హైకోర్టును ఆశ్రయించి ఉత్సవం జరుపుకోవాలని పిటీషన్ వేయడంతో హైకోర్టు సీతారాముల కల్యాణం నిర్వహించుకోవాలని, గ్రామోత్సవం నిర్వహించుకోరాదని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ విషయంపై గ్రామ ప్రజలతో చర్చించామని అన్నారు. గ్రామ పెద్దలంతా కలిసికట్టుగా పండుగను జరుపుకోవాలని సీఐ, ఎస్ఐ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసుకోవాలని, ఘర్షణలకు పాల్పడితే పోలీసు చర్యలు తప్పవని హెచ్చరించారు.

'స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి'

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 16: ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ మారాంజనేయరెడ్డి సూచించారు. మంగళవారం అల్లూరు గ్రామంలో ప్రజలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల వేళ గ్రామాల్లో అల్లరు సృష్టించవద్దన్నారు. అలాగే ఆయా పార్టీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదన్నారు.

పరీక్ష కేంద్రాలు తనిఖీ

చాగలమర్రి, ఏప్రిల్ 16: చాగలమర్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ-2 పరీక్షలను ఎంఈవో అనూరాధ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రశ్న పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషాద్రి, సీఆర్పీలు కొండయ్య, ఖాశీం పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ మంత్రి అఖిలప్రియ



గోవిందపల్లెలో టీడీపీలో చేరిన వారితో అఖిలప్రియ

నంద్యాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): టీడీపీని బలోపేతానికి కృష చేయాలని మాజీ మంత్రి అఖిలప్రియ కోరారు. ఆళ్లగడ్డ మండలంలోని ఓబుళంపల్లె గ్రామ విద్యాకమిటీ చైర్మన్ లాలుసా గారి రంజిత్ బాషా గ్రామ టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి ఆధ్వరంలో ఆళ్లగడ్డలోని మాజీ మంత్రి అఖిలప్రియ స్వగృహంలో మంగళవారం టీడీపీలో చేరారు. ఆయనతో పాటు మరో పది కుటుంబాలు చేరాయి. టీడీపీ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శిరివెళ్ల: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ నియోజకవర్గ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని గోవిందపల్లె గ్రామంలో మంగళవారం పర్యటించి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. గ్రామంలో 40 కుటుంబాలు భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభి స్తున్న వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగదాసరి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీరెడ్డి, రవిచంద్రారెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి: ఆర్వో



మాట్లాడుతున్న ఆర్వో మహేశ్వరరెడ్డి

డోన్(రూరల్), ఏప్రిల్ 16: అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గానికి సంబంధించి పోటీ చేసే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలవుతుందని, పోటీ చేసే అభ్యర్థులు నాలుగు నామినేషన్ల వరకు వేసుకోవచ్చని తెలిపారు. రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలని, షెడ్యూల్ కులాలు, షెడ్యుల్ తెగలకు రూ.5వేలు డిపాజిట్ ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు వేసుకోవాలన్నారు. అభ్యర్థుల ఖర్చు రూ.40 లక్షలు మించకూడదన్నారు .నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వస్తే.. పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ అబ్రత్ భాషా, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'పకడ్బందీగా విధులు నిర్వహించాలి'

నంద్యాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో పీవో, ఏపీవోలు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం కళాశాలలో రెండో రోజు మంగళవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో నజీర్ అహమ్మద్, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే సామాజిక న్యాయం

డోన్(రూరల్), ఏప్రిల్ 16: టీడీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుండాల ఈశ్వరయ్య మాదిగ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని దొరపల్లె గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు సహకరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. బుధవారం డోన్ పట్టణంలో జరిగే మాదిగలు, ఉప కులాల సమ్మేళానికి తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులికేశవయ్య, నాయకులు, గోసానిపల్లె రామాంజనేయులు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రుద్రవరం, ఏప్రిల్ 16: మండలంలోని చిత్తరేణిపల్లె, ఆలమూరు, ముకుందాపురం, మిట్టపల్లె గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు సెక్టోరియల్ అధికారి శ్రీనివాసశర్మ మంగళవారం తెలిపారు. చిత్తరేణిపల్లె పాఠశాల్లో టేబుళ్లు లేవని ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల నెంబర్లు పోలింగ్ కేంద్రాలకు వేయించామన్నారు. ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని చెప్పారు.

'అటవీ శాఖ అధికారులకు సహకరించాలి'

రుద్రవరం, ఏప్రిల్ 16: రుద్రవరం రేంజ్‌లోని నల్లమల అడవిలో ఉన్న పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు అటవీశాఖ అధికారులకు సహకరించాలని రేంజర్ శ్రీపతినాయుడు మంగళవరం తెలిపారు. రుద్రవరం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రుద్రవరం రేంజ్‌లో నవ నరసింహ క్షేత్రాలు ఉన్నాయన్నారు. క్షేత్రాల్లో రాత్రిపూట నిద్రించవద్దని సూచించారు. నల్లమలలో ప్లాస్టిక్, మద్యం వాడకం నిషేధమని తెలిపారు.

'ఆన్‌లైన్‌లో పొందుపరచాలి'

రుద్రవరం, ఏప్రిల్ 16: రుద్రవరం మండలంలోని పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను ఆయా పంచాయతీల నోడల్ అధికారులు ఆన్‌లైన్‌లో అభివృద్ధి పనులు పొందుపరచాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరంగా అభివృద్ధి పనులను పీడీఐ ఫోల్డరులో నమోదు చేయాలన్నారు. అలా చేయకుండా అభివృద్ధి పనులు చేయడానికి కుదరదని తెలిపారు.

'గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 16: జిల్లాలో పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ ఈఈ హరిగోపాల్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని పక్కా గృహాలను పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాలను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 2,303 గృహాలు మంజూరయ్యాయని, వాటిలో 800 గృహాలో పూర్తి చేశారని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. డీఈ నాగరాజు, ఏఈ షఫీవుల్లా ఉన్నారు.

'టీడీపీ వస్తేనే బంగారు భవిష్యత్తు'

నంద్యాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వస్తేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని భూమా అఖిలప్రియ మేనమామ ఎస్వీ ప్రసాదరెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని 163వ బూతు ఎస్వీనగర్‌లో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు భాస్కర్ తదితరులు ఉన్నారు.

చెడిపోయిన గ్యాస్ ట్యూబులను వాడొద్దు

డోన్(రూరల్), ఏప్రిల్ 16: ఇంట్లో చెడిపోయిన గ్యాస్ ట్యూబులను వాడటం ప్రమాదకరమని డోన్ అగ్నిమాపక శాఖ అధికారి రంగస్వామిగౌడు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పోచా ప్రభాకర్ రెడ్డి నగర్‌లో డెమో నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ బంద్ చేయాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

చల్లా కాలనీలో నీటి ఎద్దడి

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 16: కొలిమిగుండ్లలోని చల్లా కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. కాలనీకి అవుకు జలాల నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా జరుగుతుంది. అయితే గత 4రోజుల క్రితం అవుకు జలాల సరఫరాలో అంతరాయం కలిగింది. దీంతో కాల నీకి తాగునీటి సరఫరా జరగలేదు. నీటి కోసం ప్రజలు కాలనీలోని బోరుపై ఆధారపడ్డారు. ఈ బోరులో కూడా నీరు అంతంత మాత్రంగా ఉండడంతో బోరు నీరు కాలనీవాసులకు సరిపోవడంలేదు.

బీసీ గెలుపే మా లక్ష్యం



మాట్లాడుతున్న దూదేకుల సంఘం నాయకులు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 16: మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపే మా లక్ష్యమని దూదేకుల సంఘం నాయకుడు లాయర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల టీడీపీ కార్యాలయం ఆవరణలో దూదేకుల సంఘం నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ దూదేకుల సంఘం సభ్యులంతా వైసీపీలో చేరినట్లు సాక్షి పత్రికలో వచ్చిందని, అందంతా అవాస్తమని అన్నారు. తాము కోవెలకుంట్లలో జరిగిన దూదేకుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడానికి వెళ్లామే కాని వైసీపీలో చేరడా నికి వెళ్ళలేదని సంఘం సభ్యులు చెప్పారని ఆయన చెప్పారు. ఆత్మీయ సమా వేశానికి వెళ్లిన తమకు దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీ ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డికి మద్దతు ఇవ్వాలని తమను తప్పుదోవ పట్టించారన్నారని వారు తెలిపారన్నారు. ఆ సమావేశానికి గాలిమిషన్ బాలు, టైలర్ రాజు, కమల్, హరికృష్ణ, చిన్నకొప్పెర్ల హుసేని, గుల్లగుర్తి హుసేనయ్య, భీమునిపాడు హుసేని, అన్వర్, ఖాశీం, రఫి, నన్నా, బాలుతోపాటు వంద మంది దూదేకుల సంఘం సభ్యులు వెళ్లారని, అయితే వారు ప్రస్తుతం టీడీపీ వెంట ఉంటామని చెప్పారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ జడ్పీటీసీ సభ్యుడు బీవీ. ప్రసాదరెడ్డి, యువ నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, బాలాజీసింగ్, శంక ర్‌రెడ్డి, బిజనవేముల హుసేనయ్య, గజ్జల హుసేనయ్య పాల్గొన్నారు.

'అరాచక పాలనకు అంతం పలకాలి'

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 16: వైసీపీ అరాచక పాలనకు అంతం పలకాలని టీడీపీ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మాయలూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, గుర్రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రైతు సంక్షేమం: కోట్ల



కలచట్లలో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, ఏప్రిల్ 16: టీడీపీతోనే రైతుల సంక్షేమం సాధ్యమని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాందొడ్డి, నల్లవల్లి, కలచట్ల, ఎస్ రంగాపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కలచట్ల గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 10కుటుంబాలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, టి శ్రీనివాసులు, గండికోట రామసుబ్బయ్య, బత్తుల రమేష్ రెడ్డి, కలచట్ల ప్రసాద్, దబ్బ రామాంజినేయులు, వెంకటరాముడు, మహేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు భరోసా

డోన్(రూరల్): చంద్రబాబుతోనే యువతకు భరోసా ఉంటుందని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. మంగళవారం పట్టణంలోని 1వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. పట్టణ టీడీపీ యువ నాయకులు ధర్మవరం భరత్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: ఆర్‌ఈ లక్ష్మయ్యగౌడు కుటుంబ సభ్యులు డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, టీడీపీ రాష్ట్రకార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు పాల్గొన్నారు.